సాక్షి
తిరుపతి
బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



ఓటర్ల ప్రక్రియ పక్కాగా ఉండాలి

ఓటర్ల తొలగింపు ప్రక్రియ తప్పలకు తావులేకుండా పక్కాగా ఉండాలని కలెక్టర్ కే.వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. - 8లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

నాయుడుపేట మండలం నరసారెడ్డి కండ్రిగ సమీపంలో ఆగిన మినీ లారీని కంటైనర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	26
చిత్తూరు	34	25
తిరుమల	29	21
గూడూరు	35	27
నగరి	34	26

న్యూస్‌రీల్

8న జాబ్ మేళా

గూడూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 8వ తేది ఉదయం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్యామ్‌మోహన్, కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. గ్రీన్ టెక్ ఇండస్ట్రీ లక్ష ట్రైనీ ఆపరేటర్లు, జస్ట్ డయల్‌లో ఎగ్జిక్యూటివ్‌లు, హీరో మోటో కార్ప్‌లో అసెంబ్లింగ్ లైన్ ఆపరేటర్లు, ఏజీటీ ఆర్‌ఎస్‌లో సీనియర్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ల కోసం మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు http://bit.ly43biyya లింక్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 81435 76866, 89199 25219 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీలో టెండర్ల ఆహ్వానం

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ డిపోలు, గ్యారేజ్, కార్యాలయాల్లో పనిచేయడానికి అటెండర్లు, స్వీపర్లు, బస్సులను శుభ్రం చేసే క్లీనర్లు తదితర సిబ్బందిని సరఫరా చేయడానికి కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ చెంగల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా డిపోల్లో 8వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు టెండర్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తామన్నారు. ఆర్టీసీకి అవసరం అయిన మేరకు సిబ్బందిని సరఫరా చేయడానికి ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు టెండర్లు వేయాలన్నారు.

నేటి నుంచి ఐఐటీలో అంతర్జాతీయ సదస్సు

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ప్రాసెసింగ్, ప్యాబ్రికేషన్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌పై 29వ అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు దేశవ్యాప్తంగా పలు సంస్థల నుంచి 400 మంది ప్రముఖ శాస్త్రవేత్తలు, అధ్యాపకులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. నేషనల్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు సదస్సు జరుగుతుందన్నారు.

నింగికెగసిన కెరటం



తూపిలిపాళెం వద్ద ఎగసిపడుతున్న అలలు

వాకాడు: వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రెండు రోజులుగా మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ, నింగిని తాకుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం సముద్ర తీరంలో ఈదురు గాలులు, తుంపర్ల వర్షంతోపాటు సాగర కెరటాలు 7 నుంచి 8 మీటర్లు ఎత్తు వరకు ఎగసిపడుతున్నాయి. అలాగే తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, దుగ్గరాజపట్నం, శ్రీనివాసపురం, పామంజి, పంబలి, లైట్ హౌస్, వైట్ కుప్పం, మొనపాళెం, పూడికుప్పం, చినతోట, పూడిరాయిదొరువు, నవాబుపేట గ్రామాల వద్ద సముద్రపు అలలు తీరాన్ని తాకుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల మత్స్యకారులు మధ్యాహ్న సమయానికి తమ వేటను నిలిపివేసి బోట్లను ఒడ్డున భద్ర పరిచారు.

అవ్వా పింఛన్ అందుతుందా?



వృద్ధురాలు పుల్లం పుత్తూరు సుబ్బమ్మతో మాట్లాడుతున్న నేదురుమల్లి

రాపూరు: అవ్వా పింఛన్ అందుతుందా? అని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఓ వృద్ధురాలిని అడిగారు. ఇంటికే తెచ్చి ఇస్తున్నారు నాయనా.. అని పుల్లంపుత్తూరు సుబ్బమ్మ సమాధానమిచ్చింది. అలాగే ఆరోగ్య సిబ్బంది ఇంటికి వచ్చి చూస్తున్నారా? పరీక్షలు చేస్తున్నారా? అని అచ్చం సంజీవమ్మను అడగ్గా.. ఆరోగ్యసిబ్బంది ఇంటికే వచ్చి రక్తపరీక్షలు చేసి, మందులు ఇస్తున్నారు.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి కష్టం లేకుండా చూస్తున్నారు. ఆయన్ను భగవంతుడు చల్లగా చూడాలి.. అని సమాధానమిచ్చారు. ఈ సంభాషణలు మంగళవారం పెనుబర్తిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చోటు చేసుకున్నాయి.

విద్యకు అగ్రతాంబూలం



ఉత్తమ ఉపాధ్యాయుడు కోదండరామ్‌ను సన్మానిస్తున్న మంత్రి ఆర్కే రోజా. చిత్రంలో ఎమ్మెల్సీ, కలెక్టర్



సుబ్రమణ్యం, జెడ్పీహెచ్‌ఎస్, కోట



సుమలత, పాకాల



హరికుమార్, అనుపల్లి, రామచంద్రాపురం



ఇందిరాంబ, గుత్తివారిపల్లె, రేణిగుంట



ఫణివేణి, జెడ్పీ హెచ్‌ఎస్, తడ



మురళి, జెడ్పీహెచ్‌ఎస్ తిరుచానూరు



మధు, పద్మావతీపురం, తిరుపతి రూరల్



తులసిజ్యోతి, వెంకటగిరి, మోడల్‌స్కూల్



పరిమళ, ఎస్‌ఓ, ఎర్రావారిపాలెం

'పేద విద్యార్థులందరూ అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు అంది పుచ్చుకోవాలి. ప్రపంచస్థాయిలో పోటీ పడాలన్న సంకల్పంతో సీఎం జగనన్న విద్యకు పెద్దపీట వేశారు.' అని రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు.

- విప్లవాత్మక మార్పులతో నాణ్యమైన విద్య
- గురు పూజోత్సవంలో మంత్రి ఆర్కే రోజా

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రతి విద్యార్థిపై ఖర్చు పెట్టే ప్రతి పైసా వారి ఉజ్వల భవిష్యత్తుకు పెట్టుబడి అని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అగ్రతాంబూలం ఇచ్చారని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి మహతీ కళాక్షేత్రంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి గురుపూజోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందిపుచ్చుకుని, పోటీ ప్రపంచంతో పోటీ పడాలన్న సత్సంకల్పంతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను ముఖ్యమంత్రి తీసుకొచ్చారని తెలిపారు. అందులో భాగంగానే సుమారు రూ.70 వేల కోట్లకు పైగా ఒక్క విద్యారంగానికే వెచ్చించారని తెలిపారు. ఎంత స్థాయికి ఎదిగిన విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు. ఉన్నత సమాజం తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందన్నారు. నవభారత నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని, అలాంటి ఉపాధ్యాయులకు దైవస్వరూపులుగా మన సమాజంలో స్థానం ఉందన్నారు. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే ఆ ఉపాధ్యాయుడు నిజమైన అవార్డు అందుకున్నట్లని తెలిపారు. ఆడపిల్లల విద్య వారి భవిష్యత్తులో వెలుగులు నింపుతుందని నమ్మి బాలికా విద్యను సీఎం ప్రోత్సహిస్తున్నారని, మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారని అన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరూ తమ గురువులను మరిచిపోకూడదని అన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు మించిన వసతులు, సౌకర్యాల కల్పన, విద్యాబోధనతో పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీవిని ఎరుగని రీతిలో డిజిటల్ విద్య, బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లతో విద్యాబోధన తీసుకువచ్చినట్లు తెలిపారు. చంద్రయాన్–3 ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వీక్షించడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన అడ్వాన్స్‌డ్ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

గురువుకు మించిన దైవం లేదు

గురువుకు మించిన దైవం లేదని, భగవంతుని స్వరూపమే గురువు అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. నిస్వార్థంతో విద్యార్థి ఉన్నతే లక్ష్యంగా పాటుపడే గురువును గౌరవించడం మనందరి కర్తవ్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగానే అనేక సంస్కరణలు తీసుకొచ్చి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు 80 మందిని ఘనంగా సత్కరించి, అవార్డులు అందజేశారు. డీఈఓ డాక్టర్ వి.శేఖర్, ఎస్ఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, డీవైఈఓలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ స్థాపనలో గురువులదే కీలక పాత్ర

సమ సమాజ స్థాపనలో గురువులదే కీలకపాత్ర అని, అలాంటి గురువులను నిత్యం స్మరించుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. గురువులను గౌరవించుకుంటే సమాజాన్ని గౌరవించినట్టేనని తెలిపారు. నేటి విద్యా సదుపాయాలతో ప్రపంచంలో పోటీపడే సామర్థ్యం మనం విద్యార్థులకు అందించగలమని ఆయన తెలిపారు.

దీపం తాను వెలుగుతున్న వరకే ఇంకో దీపాన్ని వెలిగించగలదని, అలానే ఉపాధ్యాయులు కాలానుగుణంగా వారి పరిజ్ఞానాన్ని పెంచుకుని, సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని, ప్రపంచ స్థాయిలో పోటీపడేలా విద్యార్థులను తీర్చిదిద్దడంతోపాటు వారిని ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందజేయండి




పౌష్టికాహారాన్ని రుచి చూస్తున్న విజయ్ ప్రతాప్ రెడ్డి

- చంద్రగిరి మండలంలో పలు చోట్ల తనిఖీలు
- పలువురికి మెమోల జారీకి ఆదేశం

చంద్రగిరి: చిన్నారుల ఆరోగ్య భద్రత కోసం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన చంద్రగిరి సివిల్ సప్లయిస్ గోడౌన్‌తోపాటు చంద్రగిరి కోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఏ.రంగంపేటలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల, చంద్రగిరి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి బిడ్డకూ నెలకు రూ.600 ఖర్చు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వారికి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. పేద ప్రజలకు అందిస్తున్న నిత్యావసర సరుకుల్లో బియ్యాన్ని ప్రభుత్వం కిలో రూ.38కు కొనుగోలు చేసి, రూపాయికే అందిస్తుందన్నారు. ప్రతి 50 కిలోల బ్యాగులో విటమిన్స్ ఉన్న ఫోర్టిఫైడ్ ఒక కిలో కలుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఏ.రంగంపేట సెంటర్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలలో కందిపప్పు, కోడిగుడ్లు రికార్డుల్లో లెక్కలు లేకపోవడంతో అక్కడి అధికారులకు ఆయన మెమోలు జారీ చేయాలంటూ సీడీపీఓ ప్రతిభను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడీ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'పట్టా'భిషేకం



ఆస్తులున్నా అనుభవించలేని దుస్థితి.. అమ్ముకోలేని పరిస్థితి.. వెరసి జీవితం దుర్భరం.. దశాబ్దాలుగా నరకం అనుభవిస్తున్న నిషేధిత భూముల యజమానులు.. ఈ దైనందిన స్థితి నుంచి తిరుపతి ఎమ్మెల్యే భూమన విశేష కృషితో ఆ భూ యజమానులకు విముక్తి లభించింది. వారికి నేడు ఆ ఆర్డర్ కాపీలను అందజేయనున్నారు. దీనిపై ప్రత్యేక కథనం.

- గత ప్రభుత్వ హయాంలోనే 22ఏ నిబంధన
- 50 ఏళ్లుగా రిజిస్ట్రేషన్‌కు నోచుకోని ఆస్తులు
- నిషేధిత జాబితా నుంచి 104 ఎకరాలకు విముక్తి
- నేడు క్రమబద్ధీకరణ ఆర్డర్ కాపీల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

తిరుపతి తుడా: నగరంలోని పలు ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్లపై 22ఏ నిషేధిత నిబంధన శాపంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించే నాథుడే లేకపోగా 2018లో నాటి ప్రభుత్వం మరికొన్ని ప్రాంతాలను నిషేధిత జాబితాలో చేర్చింది. దీంతో ఆస్తులున్నా అనుభవించలేని దయనీయ స్థితిలో నగర ప్రజలు దశాబ్దాలుగా జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితిలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చొరవతో నిషేధిత జాబితాలోని 5,341 కుటుంబాలకు చెందిన భూములకు విముక్తి కల్పించారు. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరిలో క్రమబద్ధీకరణ ఆర్డర్ కాపీలను శివజ్యోతి నగర్ వాసులకు పంపిణీ చేశారు. దీంతో శివజ్యోతి నగర్, అయ్యప్పకాలనీ, ఎర్రకమిట్ట ప్రాంతాల్లోని 750 మందికి ఉపశమనం కలిగింది. ప్రస్తుతం మరోసారి 22ఏలోని నిషేధిత భూములకు మోక్షం లభించింది. తద్వారా సుమారు 10 వేల మందికి పైగా లబ్ధి పొందనున్నారు. ఈ జాబితా నుంచి విముక్తి పొందిన నగర ప్రజలకు బుధవారం పట్టాభిషేకం చేయనున్నారు.

50 ఏళ్లుగా నరకం

తిరుపతిలోని కొన్ని ప్రాంతాల్లో భూములను 50 ఏళ్ల కిత్రమే 22ఏ నిషేధిత జాబితాలోకి చేర్చారు. దీంతో ఆ భూములు క్రయవిక్రయాలకు నోచుకోలేదు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వారు 22ఏ నిబంధన విషయాన్ని పలుసార్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించి నిషేధిత జాబితా నుంచి ఆ భూములకు విముక్తి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో నగరవాసుల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రజలకు ఎంత చేయాలో అంతాచేస్తాం



ప్రజా సమస్యలు, వినతులు, ఇబ్బందులు ఏవైనా నా వద్దకు వస్తే వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ముందుంటాను. 22ఏ గుదిబండపై వచ్చిన అన్ని వినతులను పరిశీలిస్తున్నాం. ఇప్పటికే అనేక ప్రాంతాల్లోని భూములకు నిషేధం నుంచి విముక్తి కల్పించాం. రాబోవు రోజుల్లో మరిన్ని భూములకు ఆ నిబంధన నుంచి ఉపశమనం కల్పిస్తాం. ప్రజలకు ఎంత చేయాలో అంతా చేస్తాం. 10 వేల మందికి లబ్ధి చేకూర్చే ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని ఇస్తోంది.

– భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం



నగరంలో ఎన్నో ఏళ్లుగా భూసమస్యకు ఏ ఒక్కరూ పరిష్కారం చూపకపోగా 2018లో దాదాపు 2,300 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజల పాపం మూటకట్టుకున్నారు. ఆస్తులున్నా వాటిని అనుభవించలేని దుస్థితికి కారకులయ్యారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ప్రతిష్టాత్మకంగా తీసుకుని సీఎంతో చర్చించి పరిష్కార మార్గాన్ని సాధించారు. వేలాది కుటుంబాలలో వెలుగులు నింపారు. రాబోవు రోజుల్లో తిరుపతి నగరం మరింత మంచిని చూడబోతోంది.

–భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్, తిరుపతి

నేడు ఆర్డర్ కాపీల పంపిణీ

22ఏ జాబితాలోని 104 ఎకరాల భూములపై నిషేధం తొలగింపునకు సంబంధించిన ఆర్డర్ కాపీలను బుధవారం సాయంత్రం 4 గంటలకు నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు.

భూమన కృషి అమోఘం

నగరంలోని 22ఏ నిషేధిత భూములకు విముక్తి కల్పించేందుకు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన తనయుడు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు. వీరి కృషిని నగరవాసులు కొనియాడుతున్నారు.

ఆ పాపంలో బాబూ భాగస్వామే

తిరుపతిలోని 2,300 ఎకరాలకు సంబంధించిన భూములపై నాటి చంద్రబాబు ప్రభుత్వం 2018లో 22ఏ నిబంధన అస్త్రాన్ని ప్రయోగించింది.

తప్పుల తడక కారణంగా ప్రభుత్వ, చుక్కల, దేవదాయ, మఠం భూములతోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లోని భూములను ఆ జాబితాలో చేర్చింది. దీంతో గందరగోళం నెలకొనింది. ఆ పాపాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై రుద్దేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఎవరు ఎప్పుడు ఇచ్చిన జీఓ కారణంగా ఈ పరిస్థితులు నెలకొన్నాయో ఆధారాలసహా వివరించడంతో ప్రతిపక్ష పార్టీలు చేసేదిలేక ఆ పాపం తమ నాయకుడిదేనని తలవంచక తప్పలేదు.

104 ఎకరాలకు విముక్తి

104 ఎకరాలకు సంబంధించిన భూములు 22ఏ నిషేధిత జాబితా నుంచి విముక్తి పొందాయి. విముక్తి పొందిన ప్రాంతాల్లో తంబవాణిగుంట, కొర్లగుంట, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, నవోదయకాలనీ, ఎరుకుల కాలనీ, మారుతీనగర్, పూలవానిగుంట, ఆటోనగర్, అంబేడ్కర్‌కాలనీ, గొల్లవానిగుంట, బొమ్మగుంట, సూరయ్యకట్ట, ఎల్బీనగర్, సత్యనారాయణపురం, శ్రీకృష్ణనగర్, గాయత్రీనగర్, సుందరయ్యనగర్, సింగాలగుంట, రెడ్డిగుంట, తాతయ్యగుంట తదితర ప్రాంతాలు ఉన్నాయి.

మా జీవితాల్లో వెలుగులు నింపారు



ఏళ్ల తరబడి ఆస్తులను అమ్ముకోలేక, రుణాలు పొందలేక నిస్సహాయక స్థితిలో జీవితాలు గడిపాం. భూ సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్‌ను వేడుకున్నాం. మా మొరను ఆలకించి మా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. నాకు 20 అంకణాల రేకుల ఇల్లు ఉంది. హక్కు రావడంతో పట్టాతో రుణం పొంది, ఇల్లు కట్టుకుంటాను.

–లీలావతి, చంద్రశేఖరరెడ్డి కాలనీ, తిరుపతి

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



మా కష్టాన్ని వారి కష్టంగా భావించి నిస్వార్థంగా వేలాది కుటుంబాల్లో ఆనందం నింపారు. ఇన్ని ఏళ్ల తర్వాత మా ఇంటిపై మాకు సర్వ హక్కులు వచ్చాయని సంతోషంగా ఉంది. మా మంచి కోరి మా కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటాం.

–టి రాజమ్మ, కొర్లగుంట, తిరుపతి

మా కుటుంబాల్లో ఆనందం



మా కుటుంబాల్లో ఆనందం నింపారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన భూమన కరుణాకరరెడ్డి అన్నకు ఈ ప్రాంతంలో భూ రిజిస్ట్రేషన్లు, వాటి క్రయవిక్రయాలపై నిషేధం ఉన్న విషయాన్ని వివరించాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు.

– కుమారి, ఎంఆర్ పల్లె

సుస్థిర అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: సుస్థిర అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ శ్రీహరితో కలసి వైద్య సేవలపై సమీక్షించారు. ఆయన మాట్లాడు తూ అనీమియాతో బాధపడుతున్న గర్భిణులు, పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు, కౌమార దశలో అమ్మాయిల్లో అనీమియాతోపాటు పలు ఆరోగ్య సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని చెప్పారు. స్థానిక వైద్య బృందం క్షేత్రస్థాయిలో ఇంటింటా సర్వే చేస్తూ ఎప్పటికప్పుడు వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన వారు అందరూ ఏదో ఒక విద్యా సంస్థలో చదువుతూ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీపీఎంఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అపాచీ బస్సు బోల్తా .. 15 మందికి గాయాలు



బత్తలవల్లం చెక్‌పోస్టు వద్ద బోల్తా పడిన అపాచీ బస్సు

వరదయ్యపాళెం: కార్మికులతో వెళుతున్న అపాచీ పరిశ్రమ బస్సు బోల్తా పడి 15 మందికి పైగా గాయపడిన ఘటన మండలంలోని బత్తవల్లం చెక్‌పోస్టు కూడలి వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణ నుంచి అపాచీ పరిశ్రమకు చెందిన బస్సు కార్మికులతో బయలుదేరింది. బత్తలవల్లం చెక్‌పోస్టు వద్ద ముందుగా వెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో కార్మికులు బి.లత (26), వి. కృష్ణవేణి (38), వి. శంకరయ్య(46), ఎం.మంగమ్మ (48), ఎస్. నాగమ్మ (30), వి. కల్పన (35), ఎస్. శోభ (31), ఎన్. పుష్పలత (45), ఎం. సరళ (40), ఎస్. నాగలక్ష్మి (32), ఎస్. అంకమ్మ (30), వి. చెంగమ్మ (45), ఎస్. ధనమ్మ (32) గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, ఏఎస్‌ఐ షణ్ముగం, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. అనంతరం స్థానికుల సహకారంతో క్షతగాత్రులను 108, ప్రైవేటు వాహనా ల్లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

'గంగ'కు విరామం

ముగిసిన ఖరీఫ్.. కండలేరులో తగ్గిన నీటి మట్టం.. వర్షాభావం.. తాగునీటి అవసరం.. తదితర అవసరాల రీత్యా సేద్యానికి గంగ నీటి విడుదలకు అధికారులు విరామం ప్రకటించారు. అన్నదాతలు ఈ విషయం గుర్తించి, నవంబర్ నుంచి రెండో పంటకు సిద్ధం కావాల్సి ఉంది.

- తెలుగుగంగ నీటి పంపిణీకి 45 రోజులు బ్రేక్
- కండలేరులో 68 టీఎంసీలకు 13.5 టీఎంసీల నీరే నిల్వ
- ఈ నెల 15 నుంచి అక్టోబర్ 31 వరకు ఖరీఫ్‌కు కట్
- నవంబర్ ఒకటి నుంచి రబీకి నీరు
- కొద్ది మోతాదులో తిరుపతి, శ్రీకాళహస్తి, చెన్నైకు తాగునీరు
- ఖరీఫ్‌లో 90 వేల ఎకరాలకు సాగునీరు



తెలుగుగంగ కాలువ

తిరుపతి అర్బన్: తెలుగుగంగ నీటి విడుదలలో అధికారులు సుమారు 45 రోజులు విరామం ప్రకటించారు. తిరుపతి జిల్లాకు తెలుగుగంగ ప్రాజెక్టు ఓ పెద్దనీటి వనరు. ఈ ప్రాజెక్టు నీటిని సద్వినియోగం చేసుకోవడంలో గత పచ్చ పాలకులు నిర్లక్ష్యం వహించారు. రైతులకు రబీలో మాత్రమే కేవలం 10 నుంచి 15 టీఎంసీల నీటిని సరఫరా చేసి చేతులుదులుపుకున్నారు. ఫలితంగా ఖరీఫ్‌లో పొలాలు బీళ్లుగానే మిగిలాయి. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రబీలో 35 టీఎంసీల నీటిని వరుసగా నాలుగేళ్లు అందించారు. దీంతో తిరుపతి జిల్లాలో 1.05 లక్షల ఎకరాలు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 1.02 ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చింది. అలాగే నాలుగేళ్లపాటు ఖరీఫ్‌లో రెండో పంటకు గంగ నీటిని విడుదల చేశారు. దీంతో నాలుగేళ్లుగా వరుసగా ఖరీఫ్‌లో 90 వేల ఎకరాలు సాగులోకి వచ్చింది. ఫలితంగా 3.60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేసుకున్నారు.

కండలేరులో 13.5 టీఎంసీలే నిల్వ

కండలేరు జలాశయంలో 68.2 టీఎంసీల నీటిని నిల్వ ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం జలాశయంలో 13.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. సమీప ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గకుండా 8 టీఎంసీల నీటిని ఎప్పుడూ కండలేరులో నిల్వ ఉంచుతారు. ఇకపోతే కేవలం పంపింగ్ చేయడానికి 5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో 600 క్యూసెక్కుల నీటిని ప్రస్తుతం తెలుగుగంగ కాలువకు పంపుతున్నారు. అందులో 300 క్యూసెక్కులు చెన్నైకు వెళుతుంది. మరో 215 క్యూసెక్కులు రైతులు పంట సాగుకు వినియోగిస్తున్నారు. తాగునీటి కోసం శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం రిజర్వాయర్ నుంచి తిరుపతికి మరో 40 క్యూసెక్కులు, శ్రీకాళహస్తికి 6 క్యూసెక్కులు, రేణిగుంటకు 4 క్యూసెక్కులు పంపుతున్నారు. 35 క్యూసెక్కులు నెల్లూరు జిల్లాలో తాగునీటికి వినియోగిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 99 శాతం పంట నూర్పిడి పూర్తి చేశారు. మిగిలిన ఒక శాతం మరో వారం రోజుల్లో పూర్తి చేయనున్నారు. కండలేరు జలాశయంలో నీటిమట్టం తగ్గిన నేపథ్యంలో సెప్టెంబర్ 15వ తేదీపైన రైతులు సాగుకు తెలుగు గంగ నీటిని వినియోగించకుండా కేవలం చెన్నై, తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట, నెల్లూరు జిల్లాలో తాగునీటికి మాత్రమే 400 క్యూసెక్కుల నీటిని పంపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు ఈ పద్ధతిని అమలు చేయనున్నారు. నవంబర్ ఒకటి నుంచి తాగునీటితోపాటు సాగునీటికి రబీ సీజన్‌కు నీటిని పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. రైతులు ఈ అంశాన్ని గుర్తించి సెప్టెంబర్ 15వ తేదీ పైన 45 రోజులు గంగనీటిని వినియోగించకూడదని స్పష్టం చేస్తున్నారు.

కండలేరులో నీటిమట్టం తగ్గింది



కండలేరు జలాశయంలో నీటిమట్టం తగ్గింది. ఈ క్రమంలో తాగునీటికి మాత్రమే నీటిని వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు దాదాపుగా పూర్తి చేశారు. ఈ క్రమంలో రైతులకు సాగునీరు నవంబర్ ఒకటో తేదీ వరకు అవసరం లేదని భావిస్తున్నాం. తర్వాత వర్షాలతో కండలేరు జలాశయంలో నీటిమట్టం పెరుగుతుంది. నవంబర్ ఒకటి నుంచి సాగునీటికి, తాగునీటికి నీటిని అందిస్తాం. ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం. రైతులు ఈ అంశాన్ని గుర్తుంచుకోవాలని కోరుతున్నాం.

-సుబ్రమణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, తెలుగుగంగ ప్రాజెక్టు

ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకుంటాం



జిల్లాలోని ప్రాజెక్టుల నీటిని రైతులకు సాగునీటికి స్థానికులకు తాగునీటికి ఇవ్వడానికి ప్రతినీటి బొట్టును సద్వినియోగం చేసుకుంటాం. ఆ దిశగా అడుగులు వేస్తున్నాం. నీటి నిల్వల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులకు నీటిని అందిస్తాం. తెలుగు గంగ చరిత్రలో ఎప్పుడులేని విధంగా వరుసగా నాలుగేళ్లు రెండో పంట(ఖరీఫ్ సీజన్‌కు)కు నీరు అందించాం. తొలి పంట(రబీ సీజన్‌లో) నీటి పంపిణీ రెట్టింపు చేశాం. రైతులు ఈ అంశాలను గుర్తించాల్సి ఉంది.

-వెంకటేశ్వర్లు, చీఫ్ ఇంజినీర్, జలవనరులశాఖ

భర్త విడాకులు నోటీసు ఇచ్చారని..

తిరుపతి క్రైం: భర్త విడాకులు నోటీస్ ఇచ్చారని ఓ మహిళ మనస్తాపానికి గురై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అలిపిరి సీఐ అబ్బన్న కథనం మేరకు.. శ్రీనివాసమంగాపురం గ్రామానికి చెందిన భారతి(45)కు నాగలాపురం గ్రామానికి చెందిన తులసీరామ్‌తో 26 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి నికిత(15) కుమార్తె ఉంది. తులసీరామ్ టీటీడీలో అసిస్టెంట్ షరాఫ్‌గా పని చేస్తున్నారు. తులసీరామ్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. గత ఐదేళ్లుగా వీరిద్దరూ దూరంగా ఉండేవారు. భారతి కూతురు నికితతో కలిసి అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయకనగర్ సీటైప్ క్వార్టర్స్‌లో నివాసం ఉండేది. అయితే ఇటీవల తులసీరామ్ విడాకులు కావాలంటూ భారతికి నోటీసులు పంపించడంతో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురైంది. భర్త మేనమామ గోవిందరాజులు విడాకులు ఇవ్వాలని బలవంతం చేయడంతో ఏం చేయాలో తెలియకుండా గత నెల 31వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు గుర్తించి, ఆమెను రుయాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలు తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, భర్త తులసీరామ్‌తోపాటు వారి మేనమామను కూడా అరెస్టు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



మృతి చెందిన కార్మికుడు రమేష్ (ఫైల్), కంటైనర్ డ్రైవర్ మబూ సుభానీ (ఫైల్)

నాయుడుపేటటౌన్: మండలంలోని నరసారెడ్డి కండ్రిగ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు, హైవే సిబ్బంది కథనం మేరకు.. నరసారెడ్డికండ్రిగ సమీపంలో జాతీయ రహదారిపై ఒక వైపు రోడ్డు మరమ్మతు పనులు చేసేందుకు కంకర చిప్స్‌లోడ్‌తో వచ్చిన మినీ లారీ రోడ్డుపై నిలబడి ఉంది. రహదారి వద్ద పనులు చేసేందుకు వచ్చిన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం కాటేపల్లెకు చెందిన కావటూరు రమేష్(35) అనే వ్యక్తి రోడ్డుపై ట్రాఫిక్ బారికేడ్లు పెట్టేందుకు నిలుచుకుని ఉన్నాడు. ఆ సమయంలో నెల్లూరు నుంచి చెన్నైకు గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న కంటైనర్ టైరు పంచర్ కావడంతో అదుపు తప్పి ఆపి ఉన్న మినీ లారీని ఢీకొంది. దీంతో మినీ లారీ బోల్తా పడి అందులో ఉన్న కంకర చిప్స్ రహదారిపై నిలబడి ఉన్న కార్మికుడు రమేష్‌పై కుప్పగా పడడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. మినీ లారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎండీ చంద్, పీ శ్రీనివాసులు గాయపడ్డారు. మినీ లారీని ఢీకొన్న కంటైనర్ పంట పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. మినీ లారీని కంటైనర్ బలంగా ఢీకొనడంతో ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన కంటైనర్ డ్రైవర్ మబూసుభానీ లారీ క్యాబిన్‌లో ఇరుకొన్నాడు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ పోలీసులు, జాతీయ రహదారి హైవే సిబ్బందితో పాటు సీఐ వైవీ సోమయ్య, ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని, కంటైనర్ క్యాబిన్‌లో ఇరుక్కొన్న లారీ డ్రైవర్‌ను బయటకు తీసేందుకు శ్రమించారు. కంటైనర్ డ్రైవర్ సుమారు మూడు గంటల పాటు నరకయాతన అనుభవించి, మృత్యువాత పడ్డాడు. చివరకు గ్యాస్ కట్టర్లతో క్యాబిన్ కట్ చేసి డ్రైవర్ మృతదేహాన్ని వెలుపలకు తీశారు. రెండు మృత దేహాలను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల కు పోలీసులు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సోమయ్య తెలిపారు. క్షతగాత్రులు చంద్, శ్రీనివాసులును గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

తిరుపతి డీఆర్‌ఓగా పెంచలకిషోర్



చిత్తూరు కలెక్టరేట్ : ఏలూరు ఆర్డీఓగా పనిచేస్తున్న పెంచలకిషోర్‌ను తిరుపతి డీఆర్‌ఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో చిత్తూరు జెడ్పీ సీఈఓగా, ఆర్డీఓగా విధులు నిర్వహించారు.

ఓటర్ల ప్రక్రియ పక్కాగా ఉండాలి



వర్షంలోనూ వెంకటగిరిలో ఓటర్ల తొలగింపు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఓటర్ల తొలగింపు ప్రక్రియ తప్పులకు తావులేకుండా పక్కాగా ఉండాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వెంకటగిరి మున్సిపాలిటీ, వెంకటగిరి రూరల్, బాలాయపల్లి మండలాల్లో క్షేత్రస్థాయిలో ఓటర్ల తొలగింపు జాబితాపై తనిఖీలు చేపట్టారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2022 జనవరి 6 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు తొలగించిన ఓటర్ల వివరాలను నిశితంగా పరిశీలించారు. ఆ మేరకు విచారణ చేపట్టారు. ప్రధానంగా డబుల్ ఎంట్రీ, చనిపోయిన వారికి, మరొక ప్రాంతానికి తరలిపోయిన వారు, వలస పోయిన వారి ఓట్లను జాబితాలో నుంచి తొలగించిన వివరాలను క్షేత్ర స్థాయిలో ర్యాండమ్‌గా కలెక్టర్ పరిశీలించారు. తొలగింపుల ప్రక్రియలో బీఎల్వోలకు, ఏఈఆర్వోలకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని వెంకటగిరి నియోజకవర్గం ఓటర్ జాబితా తొలగింపు పరిశీలన ప్రత్యేక అధికారి చెన్నయ్యని ఆదేశించారు. వెంకటగిరి నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో 17,754 తొలగించారని, వాటిలో చనిపోయిన వారు 12,556, డబుల్ ఎంట్రీ లు 3,480, మరొక ప్రాంతానికి తరలి వెళ్లిన వారు 1,716 గా ఉన్నాయని వాటిని ర్యాండమ్‌గా పరిశీలించామన్నారు.

డక్కిలిలో..

డక్కిలి: మండలంలోని పలుగోడు సచివాలయ పరిధిలోని ఓటర్లు జాబితాను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని పలువురు ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి విచారించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి వివాహం చేసుకుని వెళ్లినవారి ఓట్ల వివరాలు, మృతి చెందిన ఓటర్లు పేర్లు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు,సీనియర్ సహాయకులు సుధీర్ బాబు, సిబ్బంది ఉన్నారు.

అజ్ఞానాన్ని తొలగించే మహనీయులు గురువులు



మహిళా వర్సిటీలో అధ్యాపకులను సన్మానిస్తున్న వీసీ, వర్సిటీ అధ్యాపకులు



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: విద్యార్థులలో అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించే మహనీయులు గురువులని మహిళావర్సిటీ వీసీ భారతి కొనియాడారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం గురుపూజోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సమాజ సేవకు విద్యార్థులను సిద్ధం చేయడంలో అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం వర్సిటీ పూర్వ వీసీలు, రెక్టార్లు, రిజిస్ట్రార్‌లను ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. 2022లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, అప్రిసియేషన్ అవార్డు గ్రహీతలను వీసీ సన్మానించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపకులకు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్వీయూనివర్సిటీలోని సెనేట్ హాల్‌లో మంగళవారం ఎస్వీయూ రిటైర్డ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ కే రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ హాజరై సమాజభివృద్ధిలో గురువు పాత్ర అనే అంశంపై ఉపన్యసించారు. అదే విధంగా ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, ఎస్పీడబ్ల్యూ, డిగ్రీ, పీజీ కళాశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించి, పూర్వ అధ్యాపకులను సన్మానించారు.



ఎస్పీడబ్ల్యూ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

రాష్ట్రంలో విద్యకు రూ.66 వేల కోట్ల ఖర్చు



విద్యార్థులతో కలసి డిజిటల్ క్లాసులు వింటున్న ఎమ్మెల్సీ

చిల్లకూరు: ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యారంగానికి ఇప్పటికే రూ.66 వేల కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. మండలంలోని తిక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాసులను పరిశీలించి, వారితో ముచ్చటించారు. పాఠశాలకు క్రీడా సామగ్రి ఏర్పాటు చేయాలని హెచ్‌ఎం రమణకుమార్ ఎమ్మెల్సీకి వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంట ఎంపీడీఓ నిర్మలాదేవి, పార్టీ మండల కన్వీనర్ పరంధామరెడ్డి, సర్పంచ్‌లు సతీష్‌రెడ్డి, భూపతి తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ..

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



మృతి చెందిన తేజారెడ్డి(ఫైల్)

తిరుపతి రూరల్: టిప్పర్ పక్కన నిల్చున్నాడు.. ఓ చేత్తో సెల్‌ఫోన్ పట్టుకుని మాట్లాడుతున్నాడు.. మరో చేతితో టిప్పర్‌లో ఉన్న వర్షపు నీటిని కిందకు పంపించేందుకు టిప్పర్ లిఫ్టని ఆన్‌చేసి పట్టుకున్నాడు. సెల్‌ఫోన్ మాయలో పడి..పైకి లేస్తున్న టిప్పర్ 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగులుతున్న విషయాన్ని గుర్తించలేదు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. సెల్‌ఫోన్ మాట్లాడుతునే..కాళ్లు, చేతులు కాలిపోయి, అక్కడికి అక్కడే మృతి చెందాడు. త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కాల్సిన వాడు అనంత లోకాలకు వెళ్లిపోయాడు. స్థానికుల కథనం మేరకు.. తిరుపతి కార్పొరేషన్ అక్కారంపల్లెకు చెందిన తేజారెడ్డి(26) తన మేనత్త ఊరు తిరుపతి రూరల్ మండలం అడపారెడ్డిపల్లెలో ఉంటూ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేస్తుంటాడు. గతేడాది సొంతగా టిప్పర్‌ని కొనుగోలు చేశాడు. ఇటీవల దాన్ని వేరే వ్యక్తికి విక్రయించాడు. వారం రోజులుగా బయట ప్రాంతాలకు వెళ్లడంతో టిప్పర్ కండిషన్‌ను పరిశీలించేందుకు మంగళవారం అడపారెడ్డిపల్లెకు వచ్చాడు. టిప్పర్ లారీని పార్క్ చేసిన చోట పైన 11 కేవీ విద్యుత్ లైన్ వెళుతుంది. దీన్ని తేజారెడ్డి గమనించలేదు. టిప్పర్‌ను స్టార్ట్ చేసి కిందికి దిగాడు. అంతలో ఫోన్ రావడంతో టిప్పర్‌ను ఆనుకుని కుడి చేత్తో సెల్‌ఫోన్ పట్టుకుని మాట్లాడుతూ ఎడమ చేత్తో టిప్పర్‌లో ఉన్న వర్షపు నీటిని పారబోసేందుకు టిప్పర్ లిఫ్ట్‌ను ఎత్తేందుకు ప్రయత్నించాడు. పైకి లేసిన లిఫ్ట్ 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగిలింది. దీంతో షాక్ తగిలి తేజారెడ్డి అక్కడికి అక్కడే మృతి చెందాడు. టిప్పర్ కూడా అగ్ని ప్రమాదానికి గురైంది. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని అక్కారంపల్లెకు తరలించారు. అడపారెడ్డిపల్లె, అక్కారంపల్లె గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా తేజారెడ్డి మృతిపై తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు.

లారీని ఢీకొని ..

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని షడన్ బ్రేక్ వేసి ఆపడంతో వెనుకనే వస్తున్న మోటార్‌సైకిలిస్టు లారీని ఢీకొని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట కాలనీకి చెందిన మణి మోటార్‌సైకిల్‌పై సూళ్లూరుపేటకు బయలుదేరాడు. నెలబల్లి సమీపంలోని రెస్ట్ ఏరియా వద్ద ముందు వెళ్లే లారీ షడన్ బ్రేక్ వేసి ఆపడంతో వెనుకనే వెళుతున్న మోటార్‌సైకిలిస్టు మణి వేగంగా వెళ్లి లారీని ఢీకొన్నాడు. దీంతో మణి తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూకుమ్మడి దాడి..ఇద్దరికి గాయాలు



గాయపడిన హరిబాబు అపస్మారకస్థితిలో ఉన్న కోటమ్మ

పెళ్లకూరు: మండలంలోని సీఎన్‌పేట వడ్డిపాళెం గ్రామానికి చెందిన యనమల పోలయ్య ఇంటిపై మంగళవారం తెల్లవారు జామున సుమారు 20 మందికి పైగా కలిసి మూకుమ్మడిగా దాడి చేశారు. ఈదాడిలో యనమల హరిబాబు, కోటమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా, పాణ్యం మండలం, బలపనూరు గ్రామానికి చెందిన కృష్ణుడు, చౌడేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో చిన్నకుమార్తె సుకన్య ఫేస్‌బుక్ ద్వారా హరిబాబుకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరు మేజర్లు కావడంతో రెండు నెలలు కిందట రహస్యంగా ప్రేమ వివాహం చేసుకుని, పోలీసుల సమక్షంలో సర్దుబాటు చేసుకున్నారు. అయితే సుకన్య తల్లిదండ్రులు మూడు కార్లలో సుమారు 20 మందితో కలిసి హరిబాబు ఇంటికి చేరుకుని మూకుమ్మడిగా దాడి చేశారు. గ్రామస్తులంతా తేరుకునే లోపు కార్లతో సహా కొందరు పరారయ్యారు. సుకన్య తల్లిదండ్రులతో పాటు మరో ఇద్దరు మహిళలను పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు. దాడి సమయంలో సుకన్య గొట్టిప్రోలు గ్రామంలోని హరిబాబు సోదరి ఇంట్లో ఉండడంతో ఆమెను బలవంతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేసి విఫలమైనట్లు స్థానికులు చెబుతున్నారు. దాడిలో గాయపడిన హరిబాబు, కోటమ్మను చికిత్సలు నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తర లించారు. కోటమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.